# పేవన శాస్త్రం

-బృంద తంగిరాల

సమయం ఎనిమిదిగంటల ముప్పై నిముషాలు. కాలేజీ క్యాంపస్ కళకళలాడిపోతోంది రంగురంగుల సీతాకోకచిలుకల్లాంటి విద్యార్థులతో. ఆరోజు వేసవి సెలవుల తర్వాత మొదటిరోజు. దక్షిణ భారతదేశంలో కొన్ని వేలమంది విద్యార్థులు చేరాలి అని కలలు కనే కాలేజీ అది. పదివేల మంది ఎంట్రెన్స్ పరీక్ష రాస్తే కేవలం వందమంది మాత్రమే సెలెక్టవుతారు. విద్యార్థులు డిగ్రీ పూర్తి చేశాక పీజీ లేక మాస్టర్స్ చేయడానికి ఈ కాలేజీకి వస్తారు.

తమ భవిష్యత్తు గురించి ఎంతో ముందుచూపుతో, ఒక ప్రణాళికతో వచ్చిన వీళ్ళు చిన్నపిల్లలూ, అమాయకులూ కాదు. అయినా సీటు వచ్చింది అన్న ఆనందం ఒకవైపూ, ఇక ముందు ఏమిటి అన్న గుబులు ఇంకోవైపు కనబడుతోంది కొత్తగా చేరుతున్న విద్యార్థులలో. మాకు ఇదంతా మామూలే అన్న ఒక విధమైన ధీమాతో కాలేజీలో అడుగుపెడుతున్నారు సీనియర్లు.

తొమ్మిదిగంటల ప్రాంతంలో కొత్త పరిచయాలు చేసుకుంటూ, టైమ్‌టేబుల్స్ చూసుకుంటూ వచ్చే స్టూడెంట్స్‌తో నెమ్మదిగా క్లాసులు నిండిపోయాయి.

ఆవరణంతా ఖాళీ అయిపోయింది. ఏడో నెంబరు క్లాసురూమ్‌లో ఇంకా మాటలు తగ్గలేదు. కొత్త స్నేహాలూ కలవడమూ ఆగలేదు. అది ఆస్ట్రోఫిజిక్స్‌లో స్పెషలైజ్ చేయబోతున్న జూనియర్స్ క్లాసు. ఆస్ట్రోఫిజిక్స్ అంటే ఖగోళశాస్త్రం, భౌతిక శాస్త్రం (ఫిజిక్స్, ఆస్ట్రానమీ) క్లిష్టమైన లెక్కలు ముడిపడిన సబ్జెక్టు. ఈ సబ్జెక్టు చెప్పే కాలేజీలు దేశంలో కేవలం వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

కల్పనాచావ్లా అమెరికాలో నాసా తరఫున వ్యోమగామిగా నింగికి ఎగసి, ఆ సాహసయానంలో ప్రాణాలను సైతం పోగొట్టుకుంది. ఆమె సాహసం భారతదేశ యువత హృదయాలలో శాశ్వతస్థానం కల్పించుకున్నది.

ఆ తరువాతనే ఈ ఖగోళశాస్త్రం మొదలైన సబ్జెక్టులకు డిమాండ్ బాగా పెరిగింది. ఈ కాంపిటీషన్‌లో బాగా తెలివైనవారు తప్ప నిలువలేరు కూడా.

ప్రస్తుతం క్లాసులో ఇక్కడ దాదాపు అందరూ అటువంటి వజ్రాలే. సరిగ్గా తొమ్మిది గంటలకు ప్రొఫెసర్ ఆచార్య క్లాసులో అడుగుపెట్టారు. కొద్దిగా నెరిసిన, కురచైన జుట్టు, గోల్డ్‌ఫ్రేమ్ కళ్లద్దాలతో హుందాగా, ఎవ్వరైనాసరే మర్యాదిచ్చేలా ఉంటారు ప్రొఫెసర్ ఆచార్య.

కానీ ఆ కళ్లద్దాల వెనుక ఆయన చురుకైన కళ్ళూ, చురుక్కుమనిపించే చూపులూ గమనిస్తే ఈయన మామూలు ప్రొఫెసర్ కాదని అర్థమవుతుంది.

నిజానికి ఆయన ఒకప్పుడు అమెరికాలో పేరు పొందిన ఖగోళ శాస్త్రజ్ఞుడు. నాలుగు దశాబ్దాల తరువాత అక్కడ రాజీనామా చేసి స్వదేశానికి వచ్చి ఏరి కోరి ఈ కాలేజీలో చేరారు.

ఆయన మేధాసంపత్తు వెలకట్టలేనిది. తాను ఇన్నాళ్ళు చేసిన రీసెర్చి, కనిపెట్టిన విషయాలు, వీటికన్నా ఇరవై మంది విద్యార్థులకు చదువు నేర్పడం కష్టమైనదని అంటారు ఆయన.

స్వదేశంలో కూడా ఏదైనా సంస్థలో చేరి తాను కనిపెట్టే విశ్వరహస్యాల కన్నా తన విజ్ఞానంతో మరి కొందరు ప్రతిభావంతులు కావాలని ఆయన ఆశయం.

ప్రస్తుతం క్లాసులోని విద్యార్థులందరికీ ఆయన ముఖ పరిచయమే. తన క్లాసులో ఉండబోయే ప్రతి విద్యార్థి ఫైనల్ ఇంటర్వ్యూలో ఆయన ఒకరిగా తప్పనిసరిగా కూర్చుంటారు. ఆయన పాఠాలు చెప్పేతీరు, విద్యార్థులతో మసలే తీరు మర్వెవరి మధ్యా చూడలేదని సీనియర్ విద్యార్థులు చెప్పుకుంటారు.

ఈ మొదటిరోజు క్లాసు లోపలికి రాగానే ఆయన అందరినీ కూర్చోమని, గొంతు సవరించుకుని ఇలా అన్నారు. "నేను మిమ్మల్ని ఇంతకు ముందే ఒకసారి చూశాను, మీ బయోడేటాలు వగైరా చదివాను.

అందరూ గుర్తున్నారని చెప్పలేను కానీ నా క్లాసుకు తగినవారన్న నమ్మకం నాకు ఉంది. తరువాత నా గురించి కూడా చెప్తాను మీకు. కానీ మరోసారి ఈ ప్రశ్న అడుగుతున్నాను మిమ్మల్ని. ఆస్ట్రోఫిజిక్స్ ఎందుకు చదవాలనుకుంటున్నారు మీరు? ఖగోళశాస్త్రం మీద ఎందుకు మీకు ఆసక్తి?" అడిగారు ఆచార్య.

రెండునిముషాలు క్లాసంతా మౌనంగా ఉన్నారు. తర్వాత మూడో వరుసలో ఒక అబ్బాయి లేచి చెప్పాడు.

"నాకు ఎవరూ ఇంకా చూడనవీ, ఇంకా కనుక్కోబడనీ నక్షత్రాలూ, గ్రహాలూ కనుక్కోవాలని ఉంది" అన్నాడు.

దాంతో ధైర్యం వచ్చింది క్లాసులో.

వరుసగా గొంతులు వినబడసాగాయి "నాకు అమెరికాలో నాసాలో చేరాలని ఉంది", "కల్పనా చావ్లా నాకు ఆదర్శం", "మంచి భవిష్యత్తు ఉంటుందనీ", "నాకు వేరే గ్రహవాసులను కాంటాక్టు చేయాలని ఉంది", "రీసెర్చి చేయాలని"...ఇలా చాలా జవాబులు వచ్చాయి.

అన్నీ విని తల పంకించి ఇలా చెప్పారు ఆచార్య-

"ఒకరకంగా అన్నీ నేను విన్న సమాధానాలే వచ్చాయి మీ వద్దనుండి. కానీ ఇప్పుడు నేను ఈ సబ్జెక్టు ఎందుకు తీసుకున్నానో చెప్తాను. నిజానికి ఈ సమాధానం నాది కాదు, ఇటువంటిది నేను మళ్లీ ఎక్కడా వినలేదు" అని ఆగారు.

చాలా ఆసక్తిగా ముందుకు జరిగి వింటున్నారు విద్యార్థులందరూ.

మళ్ళీ ఇలా కొనసాగించారు ఆచార్య "నేను మొదట్లో అమెరికాకు పై చదువుల కోసం వెళ్లాను. అదీ భౌతికశాస్త్రం (ఫిజిక్స్) చదవడానికి మాత్రమే. అక్కడ నాతోపాటు ఒక రష్యన్ అబ్బాయి నా రూమ్‌మేట్‌గా ఉండేవాడు. ఇది అతను చెప్పిన కథే. అతను ఆస్ట్రోఫిజిక్స్‌లో రీసెర్చి స్టూడెంట్‌గా ఉండేవాడు. చాలా తెలివైనవాడు కూడా. అప్పటికే ఒక మేధావిగా పేరుపడ్డాడు.

ఆ రోజుల్లో నిరంకుశపాలన నుండి విముక్తి కోసం రష్యా నుంచి మేధావులు పారిపోయి అమెరికా, యూరోపుల్లో తలదాచుకునేవారు. ఈ అబ్బాయి పద్ధతులు కొన్ని విచిత్రంగా ఉండేవి. ఖగోళశాస్త్రంలో మనకు తెలిసినది, మన విజ్ఞానం కేవలం వెయ్యోవంతు అనేవాడు. అందువల్ల అతడు కొన్ని థియరీలు ఊహించేవాడు.



అంటే మనం అనుకునే "హైపోథిసిస్" అన్నమాట.

ఆ తరువాత వాటి ఉనికిని నిరూపించడానికి ప్రయత్నించేవాడు. భౌతికశాస్త్రం దీనికి విరుద్ధం. అతని పనితీరు రీసెర్చి చాలావరకూ ఇలానే ఉండేవి. ఖగోళశాస్త్రంలో ఊహ, సృజనాత్మకత చాలా ముఖ్యం అనేవాడు. ఎందుకంటే "మనకేమీ తెలియదు కదా-తెలియ నివాటి ఉనికి ఎలా కనుక్కోవడమూ" అనేవాడు. మొదట్లో అతని వాదన నచ్చేది కాదు నాకు. వితండవాదం అనుకునేవాడిని. అయినా సైన్స్‌కు సృజనాత్మకత ఎందుకసలు అను కునేవాడిని.

సైన్సు వాళ్ళు బియస్సీ, ఆర్ట్సు వాళ్ళు బియ్యే అనుకునే భారతీయ మనస్తత్వం నాది. ఒక వెన్నెల రాత్రి ఇద్దరమూ బాల్కనీలో కూచుని ఇలానే వాదించుకుంటూ ఉంటే అతను ఉన్నట్టుండి నాకు ఈకథ చెప్పాడు. ఆ కథ ఎక్కడిదో, ఎవరు చెప్పారో ఎప్పుడూ చెప్ప లేదతను. అతను చెప్పిన ప్రతిమాటా ఇంకా జ్ఞాపకమే నాకు. కథ ఏమిటంటే-

"భూమికి కొన్ని కోట్ల మైళ్ల దూరంలో 'లైట్ ఇయర్స్' అంటారు ఈ ఈ కొలమా నాన్ని. భూమివంటి మరో గ్రహం ఉండేది. ఆ గ్రహం మీద కూడా కొంత ప్రాణికోటి ఉద్భ వించి వృద్ధిచెందింది. కానీ మనభూమికీ, ఆ గ్రహానికీ తేడా ఏమిటంటే ఆ గ్రహంలో రాత్రి లేదు. ఎందుకంటే ఇద్దరు సూర్యులు ఉండే చిన్న నక్షత్ర గ్రహ కూటమి అది. ఒక సూర్యుడు అస్తమిస్తూ ఉండగా, మరో సూర్యుడు ఉదయిస్తూ ఉంటాడు అక్కడ.

అయినా ఆగ్రహంలో ఆ సూర్యులకు తగిన విధంగానే జీవకోటి వృద్ధిచెందింది నెమ్మ దిగా. భూమి మీద జరిగినట్టే ఆ కొత్త గ్రహం మీద కూడా జీవం ఉద్భవించిన కొన్ని వేల సంవత్సరాలకు ఒక నాగరికత పెరిగింది. వాళ్ళు రూపంలో ఎలా ఉండేవారన్నది కాదు ప్రశ్న.

ఎటువంటి ఆకారాలున్నా సంఘజీవులు పెరుగుదల సాధిస్తాయి. నాగరికతతో పాటు రాజ్యాలూ, రాజులూ వచ్చారు. సంపదలూ, వాటితో వచ్చే ఆవేశాలు వచ్చాయి. శాస్త్ర విజ్ఞానమూ పెరిగింది. యుద్ధాలు, ఆ తర్వాత శాంతి, ఇలా ప్రగతి సాధిస్తూ పోయారు. చివరకు అణ్వాస్త్రాల వంటి భయంకరమైన ఆయుధాలు సైతం చేయగలిగారు మానవుల పరిణామక్రమంలోనే.

కానీ వారు ఏ మాత్రమూ ప్రగతి సాధించలేనిది ఒక్క ఖగోళశాస్త్రంలో మాత్రమే. ఎందుకంటే వారికి రాత్రి లేదు కదా!

ఇక్కడ మన భూమి మీద చీకటిపడ్డాక ఆది మానవుడు నక్షత్రాలూ, రాలే ఉల్కలూ అన్నీ గమనించి ఆశ్చర్యచకితుడయ్యాడు. ఈ ఆశ్చర్యం నుండి మన ఖగోళశాస్త్రమంతా పెరిగింది. గ్రహాలు, వేరే సూర్యులు, చందమామలూ తెలిశాయి. చివరకు భూమి చుట్టూ తిరిగే చంద్రమండలం కూడా చేరాం.

మరి ఈ దూరగ్రహం వాళ్లకు వేరే ప్రపంచాలూ, గ్రహాలూ ఉన్నాయని తెలిసే వీలేలేదు. వారి సూర్యుల వెలుగులో వారెన్నడూ నక్షత్రాలు చూడలేకపోయారు. వారి దురదృష్టం కొద్దీ వారి గ్రహానికో చంద్రుడు కూడా లేదు. వారికి వారి గ్రహం తప్ప వేరే ప్రపంచమే తెలియలేదు.

వారు ఆకాశంలోకి, గగనానికి ప్రయాణాలు చేయలేదు గానీ వారిలో ఒక రాజ్యప్రజలు వారి తెలివితో సమయంలో ప్రయాణం చెయ్యడం మాత్రం నేర్చుకున్నారు. గతము, భవిష్యత్తులకు ప్రయాణం చేసే సమయయంత్రం (టైం మెషీన్) రూపొందించుకున్నారు ఆ రాజ్య ప్రజలు.

చివరకు ఆ గ్రహంలో కుతకుతలు ఎక్కువై, రాజ్యాల మధ్య ఘోరయుద్ధాలు సంభవించాయి. అణ్వస్త్రాలు ప్రయోగించే ఆపద వచ్చేసింది. దాంతో సమయయంత్రం ఉన్న రాజ్యాధిపతి కొంతమంది ప్రజలను ఆ యంత్రంలో భవిష్యత్తు కాలం ఎలా ఉందో చూసి రమ్మని పంపాడు.

వారు వెళ్లి వచ్చారు. కొన్ని వేల ఏళ్ళు ముందుకువెళ్తే మన గ్రహం ప్రశాంతంగా ఉంది. మన అణ్వస్త్రాలన్నీ ఇక్కడేకాల్చి, శత్రునాశనం చేసి భవిష్యత్తులోకి వెళ్లిపోదామని అందరూ నిర్ణయించుకున్నారు. ఆ రాజు, వారి ప్రజలూ అందరూ ఆ యంత్రంలో కాలంలో ముందుకు వెళ్లిపోయారు. దాటే ముందు వాళ్ల అణ్వస్త్రాలన్నీ అక్కడే కాల్చేశారు. మిగతా దేశాలన్నీ నాశనమయ్యాయి.

ఆ కొత్తకాలంలో మళ్లీ మార్పులు సహజం. మళ్లీ క్రొత్త రాజ్యాలూ, మళ్లీ అణ్వస్త్రాలూ, మళ్లీ యుద్ధం. యథాప్రకారంగా మళ్లీ ఈ రాజ్య ప్రజలు కాలంలో ముందుకెళ్తూ మిగతావారిని చంపేశారు. ఇలా ఒక పాతిక వరకూ యుద్ధాలు జరిగాయి. ప్రతీసారి కాలంలో కొన్ని వేల సంవత్సరాలు దాటారు వీళ్ళు. కానీ చివరకు వారు ఊహించనిది జరిగింది.

ప్రతి నక్షత్రానికీ ఒక ఆయువు ఉంటుంది. మన సూర్యుడు కూడా ఒక నక్షత్రమే. కొన్ని కోట్ల సంవత్సరాలలో చల్లబడిపోతాడు. ఈ నక్షత్ర నాశనం కొన్ని దశలలో జరుగుతుంది. ఏదో ఒక దశలో ఆ నక్షత్రాల్ని అంటిపెట్టుకుని తిరుగుతున్న భూమి వంటి గ్రహాల్లో జీవకోటి వినాశనం తప్పదు. మరీ దగ్గరగా ఉంటే ఆ గ్రహం తన సూర్యుడిలో కలిసిపోవచ్చు కూడా.

ఇదేవిధంగా మన కథలోని గ్రహం అంటిపెట్టుకున్న నక్షత్రాలు (సూర్యులు) చల్లబడి అంతరించసాగాయి. ఆ ప్రజలు చాలా అణ్వస్త్రాలు వాడుతూ, భవిష్యత్తులోకి వెళ్తూ, వెళ్తూ తమ సూర్యుల గురించి ఆలోచించలేదు, గమనించలేదు. వారికి ఖగోళ విజ్ఞానమే లేదు మరి.

గమనించేసరికి పరిస్థితి చేయి దాటిపోయింది. ఏమీ చెయ్యలేని నిస్సహాయత. భవిష్యత్తులోకి వెళ్ళిచూసినా సూర్యుల వేడి తగ్గి, జీవకోటి అంతరించడమే కనబడుతోంది. వారి నాగరికత చివరి కాలంలో వారి రెండు సూర్యులు చల్లబడిన మంటలలో వారికి మొదటిసారిగా మిణుకుమనే నక్షత్రాలు కనబడ్డాయి. అంతరిస్తున్న నాగరికత కొత్తదారులు తొక్కలేదు. ఏమీ చేయలేని స్థితిలో మోడైపోయింది. వారి సమయయంత్రం మాత్రం వారి మేధస్సుకు సాక్షిగా జీవకోటి అంతరించిన ఆ గ్రహం మీద మిగిలిపోయింది- ఇదీ కథ.

సృజనాత్మకత, ఊహ లేని ఏ నాగరికతైనా ఏదో ఒకరోజు ఇలాగే ముగిసిపోతుంది. భూమి మీద జీవం పుట్టినప్పటినుంచీ బ్రతకడమూ, పెంపొందడమూ ఇవే లక్ష్యాలుగా పెరుగుతుంది. చాలా కోట్ల సంవత్సరాల తరువాత ఈ పరిణామదశకు చేరిన మనం చిరకాలం మన్నాలంటే మానవుడికి కేవలం గుడ్డి ఇన్‌స్టింక్ట్ చాలదు.

ఊహకావాలి, కలలు కనాలి. నిద్రలేచి ఆ కలలు నిజం చేసుకోవాలి. వీటన్నిటినీ కలిపేదే ఈ ఆస్ట్రో ఫిజిక్స్ సబ్జెక్టు. నా మేధస్సుకు ఊహ తోడైతే ఎంతో సాధించగలనని నేను ఈ వృత్తి ఎంచుకున్నాను.


ఊహాలోకం కవులకూ, కళాకారులకూ పరిమితం కాదు. ఆ గ్రహవాసులు వేరే ప్రపంచాల గురించి ఊహించి ఉంటే గగనయానం కనుక్కొని ఇంకెక్కడికైనా వెళ్లిపోయి బ్రతికిపోయి ఉండేవారేమో, ఊహించండి.

భవిష్యత్తులో మనమే భూమి వదిలి వేరే గ్రహాల మీద నివాసం ఏర్పరచుకోవాలంటే అక్కడ జీవితమూ, కష్టాలూ, ఉత్పాతాలు ఎలా ఉంటాయో ఊహించి పోవలసిందే కదా.

మై డియర్ స్టూడెంట్స్! నేను రేపటినుంచి సబ్జెక్టు మొదలుపెడతాను. మీలో ఎవరైనా ఊహాలోకం వట్టిదనీ, సైన్సుకూ, సృజనకూ సంబంధం లేదని గట్టిగా నమ్మితే మాత్రం రాత్రే మీ ఊరు వెళ్లిపోండి.

హావ్ ఎ గుడ్ డే!'' అని బయటకు నడిచారు ప్రొఫెసర్ ఆచార్య.

★



## రికార్డుల హోరు

చాలా సైలెంట్‌గా నిర్మాణం జరుపుకుని రిలీజయ్యాక వరస సంచలనాలు సృష్టిస్తోంది 'పోకిరి' సినిమా. ఈ చిత్రం తమిళ నిర్మాణ హక్కులే సుమారు కోటీ నలభై లక్షలకు అమ్మినట్టు వినికిడి. ఇప్పటి వరకూ దక్షిణాది భాషా చిత్రాల్లో అత్యధిక కలెక్షన్లు (40 కోట్లు) వసూలు చేసిన చిత్రంగా 'చంద్రముఖి' పేరిట వున్న రికార్డుని 'పోకిరి' అధిగమించవచ్చని చెప్పుకుంటున్నారు. మహేష్ బాబు స్టార్ స్టామినాను మరింతగా పెంచేసిన 'పోకిరి' ముందు ముందు మరెన్ని రికార్డుల్ని అధిగమిస్తుందో!

